ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 29 జనవరి 2025 | 3




తూర్పుగోదావరి జిల్లా | కోనసీమ జిల్లా | కాకినాడ జిల్లా


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు


అమలాపురంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు


పిఠాపురంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ

అక్షర.. వారధి!

అక్షరం ఏం చేయగలదు!? ప్రతి రోజూ పాఠకులకు తాజా తాజా వార్తలు చేర వేస్తుంది..అంతే..! ఇది నిన్నటి వరకూ ఉన్న ఒక వాదన.. అదేం కాదు..? 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' అక్షరం ఏం చేయగలదో నిరూపించింది.. జనగళమై ప్రజలకు ప్రజా ప్రతినిధులు . అధికారులను చేరువచేసింది.. వారధిగా మారి ప్రజా సమస్యల గళం వినిపించింది.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వర నగర్, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మూడో వార్డు, కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డులో మంగళవారం ఉదయం అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా సభలను నిర్వహించారు. ఈ సభలకు పెద్ద ఎత్తున జన స్పందన లభించింది.. ఆయా ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో జనం హాజరై సమస్యల గళమెత్తారు. రాజమహేంద్ర వరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అమలాపురంలో కమిషనర్ రాజు, పిఠాపురంలో టీడీపీ ఇన్‌చార్జి వర్మ, కమిషనర్ కనకారావు వాటిని విని పరిష్కరిస్తామని అక్కడికక్కడే హామీలు ఇచ్చారు.


సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

సమస్యలకు సాధ్యమైనంత త్వరలోనే పరిష్కారం


పిఠాపురం కమిషనర్ కనకారావు

ప్రజల సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించే కార్యక్రమంలో భాగస్వాముడిని అయినందుకు ఆంధ్రజ్యోతి బృందానికి అభినందనలు తెలుపుతున్నట్లు మునిసిపల్ కమిషనరు కనకారావు తెలిపారు. ఇక్కడ ప్రసావనకు వచ్చిన సమస్యలపై నిర్ధిష్ట కాలవ్యవధిలో పరిష్కరిస్తామన్నారు.

సమస్య: ఇళ్లస్థలాల పట్టాల అప్పగించకపోవడం?

పరిష్కారం: గతంలో పట్టాలు అప్పగించనివి రద్దయినట్లే.ఇప్పుడు 2సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇవ్వనున్నారు. త్వరలోనే సర్వేచేపట్టి రెండేళ్లలో నిర్మాణం పూర్తిచేసి ఇస్తాం.

సమస్య: కృష్ణుడు గుడి వద్ద రోడ్డు, డ్రైన్ నిర్మాణం?

పరిష్కారం: త్వరలోనే నిర్మాణానికి చర్యలు చేపడతాం

సమస్య: దివ్యాంగ పింఛన్ రావడం లేదు?

పరిష్కారం: సర్వే పూర్తికాగానే పరిశీలిస్తాం.

సమస్య: పారిశుధ్య కార్యక్రమాలు, డ్రైన్లలో పూడికతీత?

పరిష్కారం: వార్డులో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి డ్రైన్లల్లో పూడిక తొలగిస్తాం. ఫాగింగ్ చేపడతాం.

సమస్య: వేదిక దృష్టికి వచ్చిన పలు సమస్యలు?

పరిష్కారాలు: కుంతీమాధవస్వామి ఆలయ మార్గంలో స్పీడు బ్రేకర్ల ఏర్పాటు చేస్తాం. అనధికారికంగా వాహనాలు నిలపడాన్ని నియంత్రించే చర్యలు తీసుకుంటాం.

కుంతీమాధవుని కోనేరు ఆధునికీకరణను సమగ్రాభివృద్ధిప్రాజెక్టులో పొందుపర్చాం.నిధులురాగానే పనులుచేస్తాం.



అక్షరం కదిలించింది.. అండగా నిలిచింది!

» పిఠాపురం 18వ వార్డులో ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై చర్చా వేదిక


ప్రజల సమస్యలపై పిఠాపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సుజాతతో మాట్లాడుతున్న టీడీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వర్మ, పక్కనే జనసేన నేత సురేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణంరాజు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు


జనసేన నేత సురేష్, 18వవార్డు కౌన్సిలర్ అన్నపూర్ణ, బీజేపీ ఇన్‌చార్జి కృష్ణంరాజు

- » ఆద్యంతం అర్థవంతంగా సాగిన చర్చ
- » సమస్యలను నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వార్డు ప్రజలు
- » పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని వినతి
- » సానుకూలంగా స్పందించిన కమిషనర్

పిఠాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా నిలిచింది.. జనగళమై కదిలింది.. ప్రజావాణి వినిపించింది.. సాధారణ జనం ఎమ్మెల్యేస్థాయి నాయకులను కలిసి సమస్యను చెప్పుకోవాలన్నా కష్టమే. దానికి ఎన్నో సిఫారసులు.. పలుకుబడి ఉంటేనే కానీ కలవడం.. సమస్యను చెప్పుకోవడం కష్టమే. అందుకే ఆంధ్రజ్యోతి మరో కొత్తఅడుగు ముందుకేసింది..ప్రజలు..ప్రజాప్రతినిధులు.. అధికారులకు మధ్య వారధిగా నిలిచి సమస్యలపరిష్కారానికి బాటలు వేస్తోంది.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా పిఠాపురం పట్టణంలోని 18వ వార్డు కుంతీమాధవస్వామి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన చర్చావేదికకు అనూహ్య స్పందన లభించింది. మహిళలు భారీగా తరలివచ్చి సమస్యలు ఎలుగెత్తారు. అక్కడికక్కడే అధికారులు సమాధానం చెప్పడంతోపాటు పలువురు అధికారులను అప్పటికప్పుడు వేదికవద్దకు పిలిచి వివరణ ఇప్పించారు. 24గంటల వ్యవధిలోనే పారిశుధ్య సమస్య పరిష్కరించి వీధిలైట్ల నిర్వహణ మెరుగుపరుస్తామని, రాత్రి నుంచి దోమల నివారణకు ఫాగింగ్ చేస్తామని అధికారులు, నాయకులు ప్రకటించారు. 18వ వార్డులో నిర్వహించిన చర్చావేదిక ముఖ్యఉద్దేశ్యాన్ని ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి సీహెచ్ అప్పారావు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వాటిని పరిష్కరించేలా కృషి చేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.వేదికపై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నేత సూరవరపు సురేష్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, మునిసిపల్ కమిషనరు నామాకనకారావు, 18వ వార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ, కుంతీమాధవస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు, వార్డు కౌన్సిలరు కోళ్ల బంగారుబాబు ఉన్నారు. ఏడీఈటీ మేనేజరు కృష్ణారావు, సర్క్యులేషన్ మేనేజరు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతికి అభినందనలు

ప్రజలకు ప్రశ్నించే అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతికి అభినందనలు అని, ఈ కార్యక్రమాన్ని పిఠాపురం నుంచి ప్రారంభించడం శుభ పరిణామమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ రాధాకృష్ణకు అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక నిధులు రానున్నాయన్నారు. ప్రజల ముంగిటకే అధికారులు, ప్రజాప్రతినిధులను తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ఆంధ్రజ్యోతి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని జనసేన నేత సూరవరపు సురేష్ తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు నెలల్లో పిఠాపురంలో రూ.80కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపట్టడం ద్వారా ఆంధ్రజ్యోతి ప్రజలపక్షం అని నిరూపించుకుందని బీజేపీ పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కారం పొందేందుకు వీలుగా మంచి వేదికను అందించిన ఆంధ్రజ్యోతికి 18వవార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ రోడ్డులో 100 కుటుంబాలకు తాగునీటి సమస్య ఉందని, తక్షణం పైపులైను ఏర్పాటు చేయాలని కోరారు.


హాజరైన జనం

కమ్యూనిటీహాలును మార్చేశారు
-లోవరాజు, వెలంపేట, 18వ వార్డు



వెలంపేటలో గతటీడీపీ ప్రభుత్వహయాంలో రూ.10లక్షలతో కమ్యూనిటీహాలునిర్మించారు. వైసీపీ హయాంలో దీన్ని సచివాలయంగా మార్చారు. దీంతో కార్యక్రమాలకు ఇబ్బంది పడుతున్నాం. డ్రెయిన్లలో నీరు నిలిచి దుర్గంధపూరితవాతావరణం,దోమలు వస్తున్నాయి.

ఆహార పదార్థాలు అమ్ముకుంటున్నారు
-లావణ్య, సామర్లకోట రోడ్డు



పిఠాపురం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఉచితంగా ఆహారం అందించాలి. ఆ సాకుతో ఆస్పత్రి ఆవరణలో ఆహారపదార్థాలు అమ్ముతున్నారు. రోగులకు సరఫరా చేయాలి తప్ప ఇలా వ్యాపారం చేస్తే ఎలా. గైనకాలజిస్టు రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

కోనేరును తలమానికంగా చేయాలి
-జీఎస్ భాస్కరాచార్యులు, న్యాయవాది



దేశంలోని పంచమాధవుని క్షేత్రాల్లో ఒకటిగా ఉన్న కుంతీమాధవుని కోనేరును పట్టణానికే తలమానికంగా అభివృద్ధి చేయాలి.ఆలయంఎదుట చేపల వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు.టిడ్కోఅపార్ట్‌మెంట్లను అప్పగించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలాలు చూపలేదు
-దానబోయిన నాగలక్ష్మి, కృష్ణుడు గుడి వద్ద



మాకు పట్టాలు ఇచ్చారు. ఇప్పటికీ ఇళ్లస్థలాలు చూపించలేదు. నెలకు రూ.5వేలు అద్దె కడుతున్నాం. దీంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇది నా ఒక్కరి సమస్యే కాదు. అందరి సమస్య ఇదే. మాకు స్థలాలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలి.

నాకు లారీ, ఇల్లు ఉందని చెబుతున్నారు
-చెర్ల రాముడు, వెలంపేట



నాకు ఒక సెంటు భూమి, స్థలం లేవు. ఇల్లు లేదు. కానీ, సొంత లారీ ఉందని, సొంతిల్లు ఉందని చె ప్తున్నారు. దీంతో గ్యాస్ సబ్సిడీ పడలేదు. ఆన్‌లైన్‌లో తప్పులు ఎలా వచ్చాయో తెలియడం లేదు. వార్డులో పలువురు ఇలాంటి తప్పులతో బాధపడుతున్నారు.

మందుబాబుల ఆగడాలతో అగచాట్లు
-పి.విజయజనార్ధనాచార్యులు, కుంతీమాధవస్వామిగుడి వద్ద



అధికంగా భక్తులు వచ్చే కుంతీమాధవస్వామి ఆలయం సమీపంలో రాత్రి సమయాల్లో మందుబాబుల ఆగడాలు అధికమయ్యాయి. ఆలయానికి వచ్చే మార్గంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదు. ఆ సమస్య పరిష్కరించాలి.

అలా చెప్పారు.. ఇలా పరిష్కారం దిశగా అడుగులు

» ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంతో కదలిక

పిఠాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి చర్చావేదికలో ప్రజల ప్రస్తావించిన సమస్యలపరిష్కారం దిశగా అధికారులు గంటల వ్యవధిలోనే చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా పిఠాపురం పట్టణంలోని 18వ వార్డు కుంతీమాధవస్వామి ఆలయంవద్ద మంగళవారం నిర్వహించిన చర్చావేదికలో వీధుల్లో దోమల బెడదతో పడుతున్న ఇబ్బందులను ప్రజలు ఏకరవు పెట్టారు. దోమలు తమపై దండయాత్ర చేస్తున్నాయని వివరించారు. దీనివల్ల వ్యాధులు, జ్వరాలుప్రబలే అవకాశంఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రికే ఫాగింగ్ ప్రారంభిస్తామని వేదికపైనుంచి మునిసిపల్ కమిషనరు కనకారావు ప్రకటించారు. ఆయన ఆదేశాలతో ఆంధ్రజ్యోతి కార్యక్రమం ముగిసిన రెండు గంటల వ్యవధిలోనే మునిసిపల్ సిబ్బంది ఫాగింగ్ చేశారు. 18వ వార్డు పరిధిలోని కుంతీమాధవస్వామి ఆలయంవీధి, నూకాలమ్మ తల్లి, లక్ష్మీదేవిఆలయాలు, తిమ్మరాజువీధి, బొబ్బట్ల సుబ్బారావు దుకాణంవీధి, వెలంపేట, కోటవారి వీధి, పాతయాదవవీధి, గుట్లవీధి, కాకినాడ రోడ్డు, బారువారివీధి, ప్రభుత్వాస్పత్రి సెంటర్‌లో ఫాగింగ్ చేశారు. బుధవారంనుంచి పట్టణమంతా ఫాగింగ్ చేస్తామని అధికారులు తెలిపారు. ఆంధ్రజ్యోతి చర్చావేదికలో సమస్య తెలిపిన వెంటనే పరిష్కారం కావడంపై ప్రజలుహర్షంవ్యక్తం చేశారు.



పిఠాపురం పట్టణంలోని 18వ వార్డులోని వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

శిశు మరణాలపై సమీక్ష

జీజీహెచ్(కాకినాడ), జనవరి 28(ఆంధ్రజ్యోతి): శిశుమరణాలకుగల కారణాలు.. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐవో) డాక్టర్ సుబ్బరాజు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అయ్యేలా.. ప్రసవానంతర సేవలు కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లావ్యాప్తంగా డిసెంబరులో జరిగిన 19 శిశు మరణాలకుగల కారణాలను విశ్లేషించి ఇకముందు కూడా శిశు మరణాల సంఖ్య తగ్గించడం కోసం మరింత బాధ్యత వహించి ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా గ్రామాల్లో శిశు మరణాలు జరగకుండా అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మాతా,శిశులక్ష్యాలను నూటికి నూరుశాతం సాధించేలా ప్రతిఒక్కరూ పని చేయాలని ఆదేశించారు. డాక్టర్ జాన్ విల్సన్, డాక్టర్ పి.త్రివేణి, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ చైతన్యదీప్తి, డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

» జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ బిందుమాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్.. సమీక్షకు హాజరైన పోలీస్ అధికారులు

కాకినాడ క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జి.బిందుమాధవ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్‌అధికారులతో నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు తమ ఫోన్‌లకు వచ్చే ఫిర్యాదులకు వేగంగా స్పందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎస్‌హెచ్‌వోల ఫోన్ నెంబర్లను బహిరంగ ప్రదేశాల్లోను, అన్ని విద్యా,వైద్య, ఇతర కార్యాలయాలవద్ద ప్రదర్శించాలన్నారు. అన్ని వ్యాపార, విద్య, వైద్య, ప్రార్థన, బహిరంగ స్థలాల్లో సీసీ టీవీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా నేరస్థుల కదలికలను తెలుసుకుని నేరాలను అదుపు చేయడానికి వీలు కలుగుతుందన్నారు. సీసీ టీవీ ఫుటేజ్‌ల్లో మినిమమ్ 20రోజుల డేటా నిల్వఉండేలా ది ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ(మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్-2013 ప్రకారం సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ వ్యాపారస్తులను, ప్రజలను కోరారు. పోలీస్‌స్టేషన్‌లవారీగా కేసుల పెండింగ్‌కుగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఫైనర్‌లు, మహిళల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, గ్రేవ్ కేసులపై దృష్టిసారించాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సబ్‌డివిజన్లవారీగా దొంగతనం కేసులపై ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి కేసులను చేధించాలన్నారు. దొంగతనం కేసుల్లో రికవరీశాతాన్ని పెంచి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

జిల్లాలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా గంజాయి అక్రమ రవాణాను సాగిస్తే ఉపేక్షించబోమన్నారు. డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో మరిన్ని చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో రహదారి భద్రత నియమాల బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులు, వేగ నియంత్రకాలు, జిగ్‌జాగ్ సూచికలు, స్టాప్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో బ్లాక్‌స్పాట్స్ గుర్తించి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై..

సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి హోల్డ్ అయిన డబ్బులను అర్హులైన బాధితులకు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలన్నారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు 5
దారికి అడ్డంగా గేటు ఏర్పాటుపై వివాదం 5
పంట కాలువలో స్కూల్ బస్సు బోల్తా 5
నేడు అశోక్ తేజకు వేటూరి సాహితీ పురస్కారం 4
జేఎన్టీయూకేలో సంప్రదాయ జానపద నృత్యప్రదర్శన 4
కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో జాలర్లకు అవగాహన 4

నిరంతరం తల్లిదండ్రులను గౌరవించాలి

- ప్రస్తుతం బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది
- ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ తేజ

దివాన్‌చెరువు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన తల్లిదండ్రులను పిల్లలు నిరంతరం గౌరవించాలని ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ విద్యార్థులకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో అభినందన కార్యక్రమం మంగళవారం జరిగింది. శ్రీప్రకాష్ డైరెక్టర్ సీహెచ్.విజయప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్ తేజ మాట్లాడుతూ తల్లి నవ మాసాలు మోసి జన్మనిస్తే తండ్రి తన గుండెలపై మోస్తూ పిల్లను ప్రయోజకులను చేస్తారన్నారు. అందుకే పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ముఖ్యంగా కుటుంబంలో తాతలు వంటి పెద్దవారు చెప్పే మాటలు వినాలని అన్నారు. మొబైల్స్ వాడకం తగ్గించాలని, లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఈ అభినందనలో మీకు కొడుతున్న చప్పట్లు మీ విజయాలకు మెట్లు కావాలన్నారు. తాను గత 30 సంవత్సరాలుగా 2వేల సినిమాల్లో మూడువేల పాటలు రాశానని తెలిపారు. తాను సినిమాల్లోకి రాక ముందు దాదాపు 2వేల పాటలు సామాజిక, ప్రజల పాటలు రాశానన్నారు. ప్రస్తుతం బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చిందన్నారు. విజయప్రకాష్ మాట్లాడుతూ అశోక్‌తేజ చెప్పిన ప్రతీ మాట అక్షర సత్యమని, ప్రతీఒక్కరూ దానిని పాటించాలని సూచించారు. విద్య, క్విజ్, ఆటపోటీలు, పోటీ పరీక్షలు, హాజరు తదితర అంశాల్లో ప్రతిభ కనబరచిన వారికి అశోక్ తేజ బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు అశోక్ తేజకు వేటూరి సాహితీ పురస్కారం ప్రదానం

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేటూరి పురస్కార ప్రదాన వేడుకను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా తునిలోని చిట్టూరి మెట్రో ప్రాంగణంలో బుధవారం వేటూరి సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు అందజేయనున్నారు. సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.



ఆహా కాశం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం వద్ద ఆకాశం మంగళవారం సాయంత్రం అరుణవర్ణం దాల్చింది. ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు -గొల్లప్రోలు రూరల్

ఆకట్టుకున్న పురూలియా చౌ

జేఎన్టీయూకేలో సంప్రదాయ జానపద నృత్యప్రదర్శన నిర్వహణ

జేఎన్టీయూకే, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో జేఎన్టీయూకేలోని అలూమ్నీ ఆడిటోరియంలో సంక్రాంతి గానసభల పదిరోజుల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పదో రోజు పశ్చిమబెంగాల్ కళాకారులు నిర్వహించిన పురూలియా చౌ సంప్రదాయ జానపద నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పురూలియా చౌ అనేది భారతదేశంలోని పశ్చిమబెంగాల్‌కు చెందిన సెమీ క్లాసికల్ జానపద నృత్యం. పరమశివుడిని పూజించడానికి అనాదిగా వస్తున్న పూజావిధానాలు, శాస్త్రాలు మంత్రాల నుంచి వచ్చింది. చౌ అనే పదం ఛాయ అనే సంస్కృత పదం నుంచి వచ్చింది. ఈ నృత్యంలో అనేక విన్యాసాలు, యుద్ధానికి సంబంధించిన కదలికలతో పురాణాలకు సంబంధించినవే తీసుకుని చేస్తున్నారు. కళాకారులు అనేక రంగులతో కూడిన దుస్తులు, మాస్కులు వేషాలకు తగ్గట్టుగా ధరిస్తారు. ఈ నృత్యాన్ని బహిరంగ ప్రదేశాల్లో వేదికల మీద రాత్రంతా ప్రదర్శిస్తారు. 2010లో యునెస్కో పురూలియా చౌని వారి జాబితాలో చేర్చుకున్నారు. కళాకారులు నిర్వహించిన మహిషాసుర మర్ధిని, అభి మన్యువధ, జానపద నృత్యాలు అలరించాయి. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, కుమార్, విశాల్, గణేష్ ప్రభాస్ పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధిని సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



గడియారం సిద్ధం.. రండి చూసేద్దాం



సామర్లకోటలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గడియారపు స్తంభం

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గడియార స్తంభం సెంటర్ అంటూ పలు ప్రధాన పట్టణాల్లో మారుమోగే కూడలి ప్రాంతం పేరు. అదే పేరిట సామర్లకోట స్టేషన్ సెంటర్ రింగ్ సెంటర్ వద్ద పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భారీ గడియారపు స్తంభాన్ని నిర్మించాలని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన కృషి మూడవ దఫా గెలుపొంది నేటికి నిర్మాణపనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఎట్టకేలకు సదరు నూతన నిర్మాణ సెంటర్‌పై భారీ గడియారాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. మరో 2 రోజుల్లో లాంఛనంగా ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రాజప్ప సన్నాహాలు చేస్తున్నారు.

నాడు ఒరిగి... నేడు మెరిసి!


చింతూరు మండలం సింగన్నగూడెంలో 2 నెలల క్రితం అంగన్వాడీ భవనం దుస్థితి



నేడు రంగులతో మెరిసిపోతున్న అంగన్వాడీ భవనం

చింతూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు మండలం సింగన్న గూడెంలో 1998లో అంగన్వాడీ కేంద్రానికి భవనం నిర్మించారు. కాలక్రమంలో అది శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్‌కు కర్రలతో సపోర్టు ఇచ్చి నిర్వహించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ భవనానికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించి రూ.3లక్షలు మంజూరు చేశారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ పర్య వేక్షణలో 2 నెల ల్లోపే పూర్తిస్థాయిలో ఆధుని కీకరించారు. మంగళవారం దానిని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పునః ప్రారంభించారు. ఎల్‌ఈడీ టీవీ, ఇంటర్‌నెట్, ఇతరత్రా సాంకేతక హంగులు సమకూర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జున, తహశీల్దారు చిరంజీవి, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి, ఐటీడీఏ ఈఈ మురళీ, ఏఈ తరుణ్, టీడీపీ మండలాధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, నాయకులు సయ్యద్ ఆసిఫ్, మధు సూదనరావు, శంకర్, శీలం తమ్మయ్య, అంగన్వాడీ టీచరు లక్ష్మి పాల్గొన్నారు.

అన్నవరంలో భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచన
- మంత్రిని కలిసిన ఆలయ ఈవో సుబ్బారావు


మంత్రికి సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాల కల్పనకు కృషిచేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం అన్నవరం ఈవో సుబ్బారావు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న అభి వృద్ధి పనులను మంత్రికి వివరించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ కే.రామచంద్రమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. దేవస్థానం వేదపండితులు మంత్రి, కమిషనర్‌కు వేదాశీర్వచనాలు అందించారు. వ్రత పురోహిత సంఘ నాయకులు నాగాభట్ల రవిశర్మ, కర్రి నాని, మహేంద్రవాడ జగదీష్, సవితాల వీరబాబు, నాగాభట్ల శంకర్,మణికంఠ ఉన్నారు.



షీల్డు, నగదు చెక్కులు అందుకుంటున్న విజేత జట్టు సభ్యులు

రాష్ట్ర స్థాయి పురోహిత క్రికెట్ విజేత కాకినాడ రుద్రాస్

- కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ రన్నర్

అమలాపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఫైనల్స్‌లో కాకినాడ రుద్రాస్-కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ జట్లు తలపడగా.. కాకినాడ రుద్రాస్ విన్నర్‌గా, కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవ సభలో రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు కె.బుచ్చిరామ్ ప్రసాద్, ఏవీ రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈమని సూర్యనారాయణశర్మ, బ్రాహ్మణ సాధికార రాష్ట్ర అధికార ప్రతినిధి యామిజాల నరసింహమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు షీల్డులు, నగదు ప్రోత్సాహక చెక్కులు అందించారు. రాష్ట్ర పురోహితశాఖ గౌరవాధ్యక్షుడు పొదిలి నారాయణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ దుర్గాబాబు, పురోహిత సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి రాణి శ్రీనివాస్, కోనసీమ బ్రాహ్మణ సాధికార కన్వీనర్ సత్తిరాజు స్వామి, బోళ్ల వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చెల్లుబోయిన శ్రీనివాస్, ఆకొండి పవన్ పాల్గొన్నారు.

కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో జాలర్లకు అవగాహన

కాకినాడ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ 49 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ స్టేషన్ ఆధ్వర్యంలో కోస్ట్ గార్డ్ అధికారులు స్థానిక బీచ్ రోడ్డులోని కుంభాభిషేకం గుడి వద్ద మంగళవారం సాయంత్రం సముద్రంలో వేట సాగించే జాలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వేట సాగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించవల్సిన అంశాలు, తీరం హద్దుల పై అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి చెన్నైకి ఈస్ట్రన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన 34 మంది సిబ్బంది ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయలుదేరి జాలర్లతో మమేకమై వేటాడే సమయంలో వచ్చే కష్ట, నష్టాల గురించి స్పష్టంగా వివరించారు. జాలర్లు వేట చేసే సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే వెంటనే అలాంటి వారి గురించి తెలియజేయాలని సూచించారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- రాజమహేంద్రవరం డిపో నుంచి ఫిబ్రవరి 4, 14, 18 తేదీల్లో నడిపేందుకు ఏర్పాట్లు
- ఇప్పటికే టిక్కెట్లన్నీ హాట్ కేకుల్లా విక్రయం
- మరింత డిమాండ్ ఉన్నా బస్సులు సిద్ధం చేయలేని వైనం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసులు నడుపుతున్నట్టు డీఎం షేక్ షబ్నం తెలిపారు. ఇప్పటికే బస్సులను సిద్ధం చేసి టికెట్ల బుకింగ్ కూడా దాదాపుగా పూర్తి చేశారు. ఫిబ్రవరి 4,14,18 తేదీల్లో బస్సు లు బయలుదేరుతాయన్నారు. 4వ తేదీన మూడు, 14వ తేదీన రెండు, 18వ తేదీన రెండు బస్సుల్లో భక్తులు వెళతారని చెప్పారు. ఏడు రోజులు, పదకొండు రోజులుగా కుంభమేళా యాత్ర పూర్తయ్యేలా రెండు రూట్లలో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉన్నా .. మరిన్ని బస్సులు నడపాలంటే కష్టమేనని, అందుకు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే బస్సులోని ప్రయాణికులకు భోజనం, తదితర సదుపాయాలు కల్పించాలంటే బయట వ్యక్తులు అవసరం కానుంది. అందువల్ల సర్వీసులు నడపలేకపోతున్నట్టు తెలిసింది. ఈ యాత్రకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో కలిపి ఒక్కొక్కరికి రూ. 10,000 టికెట్ ధరగా నిర్ణయించారు.

- ఆర్టీసీ వర్గాల్లో ఆనందం

టిక్కెట్లన్నీ ఇప్పటికే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆర్టీసీ దీనిపై పెద్దగా ప్రచారం చేయకపోయినా... బుక్ కావడంతో ఆర్టీసీ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 4, 18వ తేదీన కుంభమేళా యాత్రకు వెళ్లే మొత్తం ఐదు బస్సుల టికెట్లు ఇప్పటికే బుకింగ్ పూర్తయిందని, 14వ తేదీన బయలుదేరే రెండు బస్సుల్లో ఒక బస్సుకు టికెట్ బుకింగ్ క్లోజ్ కాగా, రెండో బస్సుకు సైతం డిమాండ్ ఎక్కువగా ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

అయినవిల్లి విఘ్నేశ్వరుడి హుండీ లెక్కింపు

- 67 రోజులకు రూ. 34.67 లక్షల ఆదాయం


ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి హుండీలను మంగళవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారి జంగా రామలింగేశ్వరరావు వ్యవహరించారు. మొత్తం 67 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల నుంచి నగదు రూ.33,43,400, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ.1,24,100, వెరసి మొత్తం రూ.34 లక్షల 67,500 ఆదాయం వచ్చింది. అలాగే 409 గ్రాముల వెండి, 12 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్


శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు వివిధ శాఖలలోని నిపుణులతో రెండురోజుల పాటు పంచాయతీ కార్యదర్శులకు అందిస్తున్న శిక్షణ తరగతులను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మండలాలకు చెందిన రెండవ బ్యాచ్ పంచాయతీ కార్యదర్శులకు కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ ఆవరణలో అందిస్తున్న ఈ శిక్షణ తరగతులను మంగళవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. పీసా చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ వివరించారు. ఐదు జిల్లాలకు చెందిన ఆయా పంచాయతీల కార్య దర్శులు సుమారు 67 మంది హాజరయ్యారు. జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామ నాథం, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఎం.చక్రపాణి రావు, నిహారిక, జగదీష్, వి.ప్రసాద్, వి.ఆంజనేయులు, పద్మజ, మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 28(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లకు సంబంధించి పునఃపరిశీలన రెండో రోజైన మంగళవారమూ కొనసాగింది. కాకినాడ జీజీహెచ్, తుని ఏరియా ఆసుపత్రుల్లో జరిగిన ఈ ప్రక్రియకు 198 మంది హాజరు కావాల్సి ఉండగా, 193 మంది మాత్రమే వచ్చారు . సోమ, మంగళవారాల్లో మొత్తం 378 సర్టిఫికెట్లను పరిశీలించారు.

నలుగురు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

● పేకాట క్లబ్‌లకు అడ్డగోలుగా అనుమతులు ● ఇప్పటికే కమిషనర్‌పై వేటు

● విచారణ అనంతరం ఉద్యోగులపై వేటు ● కమిషనర్ ఇచ్చిన వాంగ్మూలంతోనే వేటు..!

యానాం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో మున్సిపల్ శాఖ కు సంబంధించి నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు పుదుచ్చేరి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ జి.సౌందర్య రాజన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను యానాం మున్సిపల్ కమిషనర్, పరిపాలనాధికారికి పంపారు. యానాంలో రీక్రియేషన్ పేరుతో వచ్చిన పేకాట కేంద్రాలకు అడ్డగోలుగా ట్రేడ్ లైసెన్సుల అనుమతులు ఇవ్వడం అనంతరం ఈ విషయంలో లక్షలాది రూపాయలు చేతులు మారడం వంటి అంశాలపై విచారణ నిర్వహించిన అనంతరం ఉద్యోగులపై వేటువేశారు. గతంలో ఈ అనుమతులపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రకాశంను ప్రభుత్వం గత సంవత్సరం జనవరి 21న విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఈనేపథ్యంలో పుదుచ్చేరి నుంచి వచ్చిన ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో జరిగిన విచారణలో అడ్డగోలు అనుమతులను గుర్తించడంతోపాటు ఇప్పటికే సస్పెండ్‌కు గురైనా కమిషనర్ వాగ్మూలంతో వీరిపై వేటు వేసినట్లు సమాచారం. వీరిలో బిల్ కలెక్టర్లు ఎం.అప్పారావు, పి.దుర్గారావు, కె.సత్యనారాయణ, పి.ఉషారాణిలు ఉన్నారు. అదేవిధంగా రాయల్ రీక్రియేషన్ క్లబ్‌కు సంబంధించి అనుమతుల జారీ విషయంలో మరో ముగ్గురు ఉద్యోగుల(ఇద్దరు మహిళ, ఒక పురుషుడు)పై వేటు పడనుంది. ఈ అంశం ప్రస్తుతం యానాంలో తీవ్ర చర్చకు దారి తీసింది. వీటితో పాటు పారిశుధ్య పనుల విషయంలో ఫిర్యాదులు అందడంతో సీబీఐ స్థాయి విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో వీటిపై ఎంతమందిపై వేటు పడనుందనే అంశం ప్రస్తుతం యానాంలో హాట్ టాపిక్‌గా మారింది.

1న సీఎం చంద్రబాబు తూర్పు పర్యటన

» దొమ్మేరులో పేదల గృహ ప్రవేశం

» ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ

» జిల్లా కలెక్టర్ ప్రశాంతి



దొమ్మేరులో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాల్గోసారి సీఎం పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో పేదల కోసం నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించి, గృహప్రవేశాలు సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను కూడా సీఎం స్వయంగా లబ్ధిదా రులకు అందజేస్తారు. అనంతరం అక్కడ హౌసింగ్ లబ్ధిదారులతో సభ నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్ తదతర అధికారులతో సమీక్షించారు. భద్రత దృష్ట్యా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఆర్భా టాలకు దూరంగా, సాదాసీదాగా సీఎం పర్యటన ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్ తెలిపారు. ముందుగా కలెక్టర్ మా ట్లాడుతూ 1వ తేదీన సీఎం చంద్రబాబు దొమ్మేరులో పేదల గృహ ప్రవేశ కార్యక్రమం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారన్నారు. అధికార్లంతా సమన్వయంతో వ్యవహరించి సీఎం పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమానికి పూర్తి స్థాయి ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు హెలిప్యాడ్ ఏర్పాటుకు ఆర్అండ్‌బీ అధికారులు, ప్రొటోకాల్ వ్యవహారాలు ఆర్డీవో బాధ్యత వహిస్తారన్నారు. పోలీసులు లా అండ్ ఆర్డర్ చూ స్తారని చెప్పారు. కొవ్వూరు డివిజన్, నియోజకవర్గం, దొమ్మేరు గ్రామ పంచాయతీకి సంబంధించిన యాక్షన్‌ప్లాను సీపీవోకు, శానిటేషన్, మంచినీటి పనులను మున్సిపల్ అధికార్లకు ఇతర పనులను ఆయా శాఖలకు అప్పగించారు. ఎస్పీ డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. సమావేశంలో డీఆర్వో టి.సీతా రామమూర్తి, ఆర్డీవోలు రాణి సుస్మిత, కృష్ణనాయక్, హౌసింగ్ ఇన్‌చార్జికె.భాస్కర్ పాల్గొన్నారు.

అడివి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన విష్ణుదొర

గోకవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అడవిపంది దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గంగవరం మండలం దోనేపల్లికి చెందిన బి.విష్ణుదొర మంగళవారం పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. ఇంతలో అక్కడ ఉన్న అడివి పంది దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాధితుడు గాయాలతో ఇంటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం 108 వాహనంలో గోకవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

» బాధిత కుటుంబ సభ్యులు దేహశుద్ధి

» సెలవుపై వెళ్లిపోయిన ఉపాధ్యాయుడు

» ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

కరప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక కార్యదర్శిగా సామాన్య ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంతోపాటు బాధ్యత కలిగిన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఒక వ్యక్తి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు. అభం శుభం తెలియని ఐదేళ్ల బాలికను లైంగికంగా వేధించి కన్నవారి ఆగ్రహానికి గురయ్యాడు. బాధిత కుటుంబీకులు దేహశుద్ధి చేయడంతో అవమానభారంతో సెలవుపై వెళ్లిపోయాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వాకాడ మెయిన్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీఎస్ రామారావు అదే పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఒక బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాదజత బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో కామాంధుడి భాగోతం బయటపడింది. ఈలోగా సదరు ఉపాధ్యాయుడు గ్రామ పెద్దలను ఆశ్రయించడంతో ఈనెల 3న పాఠశాలలో ఇరువర్గాలను పిలిచి రాజీ ప్రయత్నం చేశారు. ఈక్రమంలో బాలిక తల్లి కామాంధుడి ముఖంపై ఉమ్మివేసి నానా దుర్భాషలాడగా, బంధువులు దేహశుద్ధి చేశారు. జరిగిన విషయం బాహ్య ప్రపంచానికి తెలిస్తే తమ పరువుపోతుందని భావించిన బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేసినట్టు తెలుస్తోంది. పాఠశాల నుంచి సదరు ఉపాధ్యాయుడిని పంపించివేయాలని బాలిక కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో అతను సెలవుపై వెళ్లిపోయాడు. దీనిపై వివరణ కోరేందుకు మండల విద్యాశాఖాధికారిణికి ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. జనవిజ్ఞాన వేదిక జనరల్ సెక్రటరీగా లెక్చర్లు ఇచ్చే రామారావు తనవద్ద చదువుకునే బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంపట్లవిమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి ఉపాధ్యాయులపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖతీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

» చేయి, మెడపై గాయాలు

» ఆస్తి తగాదాలే కారణం

రంగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త వీరంపాలెంలో ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి చెయ్యి, మెడపై తీవ్ర గాయాలయ్యాయి, రంగంపేట ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త వీరంపాలెంకి చెందిన మత్స సతీష్‌కి అదే గ్రామానికి చెందిన మత్స శ్రీనివాస్‌కి కొంత కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం సతీష్ తన ఇంటివద్ద భార్యతో ఉండగా శ్రీని వాస్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన సతీష్ చెయ్యి అడ్డుపెట్టడంతో బొటనవేలు, మెడపై గాయాలయ్యాయి, సతీష్ భార్య వెంటనే బంధువుల సహాయంతో అనపర్తి గంగిరెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తనభర్తను చంపాలనే ఉద్దేశ ంతో కత్తితో దాడికి పాల్పడిన శ్రీని వాస్, ప్రోత్సహించిన అతని తండ్రి సుబ్బన్నను కఠినంగా శిక్షించాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మరో యువకుడి మృతి

ముమ్మిడివరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై-జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో శనివారంరాత్రి నలుగురు యువకులు గాయపడగా వారిలో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన గెద్దాడ మణికంఠ(20) మంగళవారం మృతి చెందాడు. అయినవిల్లి మండలం ఎరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్(18) ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో ఎరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్ (18), అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజులు ఒక మోటారుసైకిల్‌పై అమలాపురం వైపునుంచి ముమ్మిడివరం వస్తుండగా కాకినాడ నుంచి మలికిపురం వెళుతున్న గెద్దాడ మణికంఠ, నల్లి వంశీ మరో మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది. అయితే వడ్డి సిరాజ్, గెద్దాడ మణికంఠలు చికిత్స పొందుతూ మృతి చెందగా ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు చికిత్స పొందుతున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చమురు సంస్థలు పర్యావరణానికి విఘాతం కలుగకుండా

జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్



మోడేకుర్రులో ఓఎన్జీసీ సైటును పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చమురు, సహజవాయువులు వెలికితీత మూలంగా పర్యావరణానికి ఎటువంటి విఘాతం కలుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో నెలకొల్పిన న్యూ జనరేషన్ రిగ్గు స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీ అమలులో భాగంగా ఏర్పాటుచేసిన ఆధునాతన రిగ్గు పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్ కంపెనీ ప్రతినిధులు ఈ రిగ్గు పనితీరంతా ఆటోమేటిక్‌గా ఆపరేట్ అవుతుందని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆధునాతన సాంకేతిక టెక్నాలజీతో పనిచేసే రిగ్గు మూలంగా పర్యావరణానికి ఎటువంటి హానీ కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఓఎన్జీసీ అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించవచ్చునన్నారు. ఓఎన్జీసీ అధికారులు స్థానికంగా ఈ ప్రాంత అభివృద్ధికి సహాయపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టేట్ సపోర్టు మేనేజర్ జి.శ్రీనివాస్, దోలా కిషోర్, ఆర్పీసింగ్, ఓఎన్జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి యువకుడి గల్లంతు



అల్లవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు, పాశర్లపూడి వైనతేయ బ్రిడ్జిపై యాక్సిస్ స్కూటీని వదిలిపెట్టి వైనతేయ గోదావరి నదిలో దూకి యువకుడు గల్లంతయ్యాడు. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన జవ్వాది కృపాకిరణ్ (25) గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. చెన్నైలో విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కృపాకిరణ్ శనివారం చెన్నై నుంచి ఇంటికి వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నైలో ఉద్యోగం చేసే సంస్థలో ఎదైనా గొడవపడి ఉంటాడని, వచ్చిన నాటి నుంచి మనోవేదనతో ఎవరితో మాట్లాడకుండా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.నాలుగు నెలల క్రితమే చెన్నైలో ఉద్యోగం వచ్చిందని, ఇటీవల సంక్రాంతికి వచ్చి వెళ్లి మళ్లీ వచ్చాడని తల్లి సీత అన్నారు. కృపాకిరణ్ తన స్కూటీని వదిలి బ్రిడ్జిపై నుంచి దూకేయడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో అల్లవరం పోలీసులకు సమాచారం అందించారు. తల్లి సీతకు కృపాకిరణ్ ఒక్కడే కుమారుడని ఆమె భర్త నాగేశ్వరరావు గతంలో చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకునియాక్సిస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. గల్లంతైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జవ్వాది కృపాకిరణ్ ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేస్తున్నామని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



పంట కాలువలో బోల్తా పడిన స్కూల్ బస్

పంట కాలువలో స్కూల్ బస్సు బోల్తా

● స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడిన విద్యార్థులు

పెద్దాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో స్కూల్ బస్సు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట పట్టణానికి చెందిన శ్రీ వివేకానందా స్కూల్ బస్సు దివిలి, వడ్లమూరు గ్రామాలకు చెందిన విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లే క్రమంలో వడ్లమూరు గ్రామానికి చేరుకునేసరికి రోడ్డు ఇరుకుగా ఉండడంతో బస్సు అదుపుతప్పి సమీపంలో ఉన్న పంట కాలువలోకి బోల్తా కొట్టింది. ఆ సమయంలో బస్సులో ఉన్న ఏడుగురు విద్యార్థులకు స్వల్పంగా గాయాలు కావడంతో వారు బస్సులో నుంచి విద్యార్థులు హాహాకారాలు చేశారు. సమీపం లో ఉన్న రైతులు వెంటనే అక్కడకు చేరుకుని వారిని రక్షించారు. రోజూ బస్సును నడిపే డ్రైవర్ సెలవు పెట్టడంతో తాత్కాలికంగా మ రో డ్రైవర్‌ను పాఠశాల యాజమాన్యం ఏర్పా టుచేయడంతో ఈ ప్రమాదం సంభవించి నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పెద్దాపురం ఎస్ఐ మౌనిక సంఘటనా స్థలా నికి చేరకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడ్డ విద్యార్థులను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు పంపించే ఏర్పాటు చేశారు. ఈ విషయంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారికి అడ్డంగా గేటు ఏర్పాటుపై వివాదం

● అడ్డుకున్న మహిళలపై పెట్రోల్ పోసిన వైనం

● కరప పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన



కరప పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న గొడ్డటిపాలెం గ్రామస్తులు

కరప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపమండలం గొడ్డటిపాలెం గ్రామంలో ఒక వ్యక్తి నలుగురు నడిచే దారికడ్డంగా గేటు ఏర్పాటుచేయడంపై వివాదం నెలకొంది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొడ్డటిపాలెం గ్రామంలోని మాస్టారు గారి వీధికి చేర్చి నక్కా సత్యనారాయణ, అతని కుమారుడు బ్రహ్మాజీలు ఈనెల 23న గోడ కట్టి గేటు పెట్టే ప్రయత్నం చేశారు. దీనిపై అభ్యంతరం తెలిపిన పలు కుటుంబాల వారు అదే రోజు అధికారులకు ఫిర్యాదుచేశారు. అయినా పట్టించుకోకుండా రెండురోజుల క్రితం గేటు ఏర్పాటుచేశారు. అక్రమంగా గేటు ఏర్పాటుచేయడాన్ని తట్టుకోలేని వీధిలోని మిగిలిన కుటుంబాల వారు మంగళవారం ఉదయం ఎక్స్‌కవేటర్ సహాయంతో గేటును తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో కోపోద్రిక్తుడైన నక్కా బ్రహ్మాజీ పెట్రోల్ తీసుకువచ్చి అక్కడ మోహరించిన మహిళలపైన, ఎక్స్‌కవేటర్‌పైన చల్లాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. బాధిత మహిళలు, కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి కరప పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. అక్రమంగా గేటును ఏర్పాటుచేయడమేగాక తమపై దాడిచేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం ఫిర్యాదుచేసి అక్కడి నుంచి వెనుదిరిగారు. అయితే దీనిపై కరప పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించకపోవడం గమనార్హం.

ముగ్గురు దొంగల అరెస్ట్

» రూ.13.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు. ఐదు బైక్‌ల స్వాధీనం

భీమవరంటౌన్, జనవరి (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరె స్టు చేసి వారి వద్ద నుంచి 13 లక్షల 38 వేల రూపాయిల బంగారు ఆభణాలు, ఐదు మోటా రు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. కాళ్ల మండలం సీసలిలోని ముగ్గళ్ల నర్సింహారావు ఇంటిలో దొంగతనానికి పాల్పడిన అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంకు చెందిన జొన్నల వెంకటేష్, కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన ఆకురాతి జోష్ణదేవితోపాటు భీమవరంలోని అట్టిక గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్న పాలకొల్లుకు చెందిన గొర్రెల కృష్ణలను అరెస్టు చేశామన్నారు. నిందితులను ఆకివీడు సీఐ వి.జగదేశ్వరరావు, ఎస్ఐ నాళం శ్రీనివాసరావు విచారించగా జొన్నల వెంకటేష్, ఆకురాతి జోష్ణదేవి జిల్లాలోని ఉండి, పెంటపాడు, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్, ఏలూరు జిల్లాలో నిలక్కవరం, తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజ ర్ల ప్రాంతంలో బంగారు గొలుసులు దొంగతనాలకు పాల్పడ్డామని తెలిపారన్నారు. కాళ్ళ, ఉండ్రాజవరం, ముదినేపల్లి పరిధిలో మోటారు సైకిళ్లను దొంగతనం చేశారన్నారు. జొన్నల వెంకటేశ్ ఆటోలు, బస్సులు కోసం ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారికి మోటారు సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చి వారి మెడలోని బంగారు ఆభణాలు దొంగిలించే వాడన్నారు. నిందితులు వెంకటేశ్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.70 వేలు. జోష్ణదేవి ఖాతాలో రూ.1.80 లక్షలు సీజ్ చేశామన్నారు. ఈ కేసులో అట్టిక గోల్డ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సివుందన్నారు. కేసును ఛేదించిన సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబు ళ్లను అభినందించి నగదు రివార్డులను అందిం చారు. సమావేశంలో డీఎస్పీ ఆర్.జయసూర్య, ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుమారస్వామిని హత్యచేసిన

నిందితులను శిక్షించాలి

» ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు



రాజోలులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

రాజోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ప్రాజెక్టు చెరువులో అదే గ్రామానికి చెందిన గుమ్మడి కుమారస్వామి మృతదేహం తేలియాడిన సంఘటన మంగళవారం పాఠకులకు విదితమే. కుమారస్వామి చెరువులో పడి మృతిచెందలేదని, తలమీద, పీక మీద దెబ్బలు ఉన్నాయని కుమారస్వామిని కొట్టి చంపి చెరువులో పడవేశారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజోలు సామాజిక ఆసుపత్రి వద్ద కుమారస్వామి కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. కుమారస్వామిని హత్యచేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 26న కుమారస్వామి కనిపించడంలేదని రాజోలు పోలీసుస్టేషన్‌లో కుమారస్వామి మామయ్య సారిక వెంకటశ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈనెల 28న మంచినీటి చెరువులో శవమై తేలాడు. కుమారస్వామిని కొట్టి హత్య చేశారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారని తెలిపారు. కుమారస్వామి కుటుంబ సభ్యులు నలుగురు అనుమానిత వ్యక్తుల పేర్లను పోలీసులకు తెలిపాడు. ఆ నలుగురిలో ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నామని, మిగతా ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. దీంతో కుమారస్వామి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

జనన ధ్రువీకరణ పత్రం కోసం లంచం డిమాండ్ చేసిన

వీఆర్వో సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గండేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రం కోసం లంచం డిమాండ్ చేస్తున్న వీఆర్వోపై సోమవారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పం దించారు. ఈమేరకు వీఆర్వో సరుగోల సూర్యారావును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడజిల్లా గండేపల్లి మండలం లోని సూరంపాలెం గ్రామానికి చెందిన అడ్డల అనంతలక్ష్మి వారి పిల్లలకు సంబంధించి జనన ధృవీకరణ పత్రాల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు

● 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు పాత నేరస్తులను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దొంగల వివరాలను పోలీసులు వెల్లడించారు. రాజమహేంద్రవరం లాలాచెరువు హౌ సింగ్ బోర్డు కాలనీకి చెందిన తోట శివ, యానాం జార్జ్ పేట మహాలక్ష్మికాలనీకి చెందిన షేక్‌బషీర్, రాజమహేంద్రవరం నారాయణపురం గెయిల్ కార్యాలయం వెనుక ప్రాంతం వాంబేకాలనీకి చెందిన కాపు అరుణసాయికుమార్‌లను పోలీసులు అరెస్టుచేశారు. ఈనెల 25వ తేదీ రాత్రి 11గంటల సమయంలో చౌడేశ్వరనగర్‌లో మంచలి నరేష్ అనే వ్యక్తి రాజానగరం నుంచి స్కూటీపై ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో రాత్రి ఈ ముగ్గురు దుండగులు అడ్డగించి కత్తితో బెదిరించి స్కూటీ లాక్కుని తన వద్ద ఉన్న రూ.4 వేలు లాక్కుని వెళ్లిపోయారని బాధితుడు బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తమకు వచ్చిన సమాచారంతో స్థానిక సీఐ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుంది. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

తునిలో ముగిసిన దివ్యాంగుల

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆంధ్రప్రదేశ్ పారా వాలీబాల్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. కాకినాడ జిల్లా తుని రాజా కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 150 మంది దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారా వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు శివదత్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ఒలింపిక్స్‌కి పంపించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. విజయనగరం టీమ్ విన్నర్‌గా, శ్రీకాకుళం టీమ్ రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్లకు విశాఖజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్‌తో కలిసి అసోసియేషన్ సభ్యులు బహుమతులు, నగదు చెక్కులు అందజేశారు. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయికి 20 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జనసేన పాయకరావుపేట నియోజకవర్గ నాయకుడు శ్రీనివాస్‌కుమార్, కాకినాడ కోలా సోమశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, జనసేన అనకాపల్లి జిల్లా సెక్రటరీ రాకెట్ గోవిందరావు, జాయింట్ సెక్రటరీ పురందాసు అప్పలరాజు, రాజీపేట ప్రెసిడెంట్ పిక్క స్వామి, బోడపాటి సతీష్, ఈవెంట్ ఆర్గనైజర్లు గోవిందు, శ్రీను, మధు, నాగశక్తి పాల్గొన్నారు.



దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:207804

బిజినెస్ ఆఫర్

ఇంటి వద్దనే ఉండి కొవ్వొత్తులు తయారి ద్వారా అధిక ఆదాయం పొందండి. కొవ్వొత్తులు తయారికి ఉపయోగించే డైస్ (అచ్చులు) మా వద్ద అమ్మకానికి కలవు సెల్: 8143161115

AJD:207905

4 Lines CLASSIFIED Rs.230/- Only

కాకినాడ

31న సామర్లకోట కౌన్సిల్ సమావేశం

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31న ఉదయం కౌన్సిల్ హాలు నందు చైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన జరుగనున్నట్టు కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై కౌన్సిలర్లతో సమీక్షించనున్నందున కౌన్సిలర్లందరూ హాజరుకావాలని ఆమె కోరారు.

పాఠశాలను పట్టించుకోండి!

- అధ్వానంగా దోమాడపాకలు ప్రభుత్వ పాఠశాల
- తరగతి గదుల్లో విద్యార్థులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి
- నిర్లక్ష్యంగా అధికారులు


శిథిలావస్థలో ఉన్న దోమాడపాకలు పాఠశాల

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో సర్ ప్లస్ వియ్యర్ శివారున దోమాడపాకలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. పాఠశాల పరిసరాలు గేదెల పశుగ్రాసం, పేడ పశువుల మూత్రాలతో అపారిశుధ్యంగా మారింది. 1 నుంచి 5 తరగతుల వరకూ సుమారు 40మంది విద్యార్థులు హాజరవుతున్నప్పటికీ పాఠశాల పరిసరాలు దుర్గంధ భరితంగా ఉండడంతో విద్యార్థులు తరగతి గదుల్లో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. సర్వశిక్షా భియాన్ నిధులతో నిర్మించిన ఈ పాఠశాలకు నిర్వహణా కార్యక్రమాలు చేపట్టడంలో విద్యాశాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు సైతం సమయపాలన చేయరన్న ఫిర్యాదులు ఉన్నాయి. రోజువారీ పాఠశాలలో జరిగే కార్యక్రమాలపై సమాచారం సేకరించాల్సిన విద్యాశాఖ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మండల విద్యాశాఖాధికారి కనీసం నెలలో ఒక రోజు కాదుకదా ఏడాదికి ఒకరోజైనా ఈ పాఠశాల సందర్శించిన దాఖలాలు లేవు. అదే పట్టణంలోని ఒక ఉన్నత పాఠశాలను అయితే వారంలో నాలుగు రోజులైనా సందర్శిస్తుండడం గమనార్హం. దీంతో ఇక్కడి పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య మిధ్యగానే ఉండిపోతుంది. ఏళ్ల తరబడి పాఠశాల నిర్వహణ లేకపోవడంతో కనీసం వైట్‌పెయింట్ కూడా వేయకపోవడంతో పుష్కరంన్నరకాలంగా పాఠశాల శిథిలావస్థలో ఉండిపోయింది. పాఠశాల గొట్టపు బావి పూర్తిగా విరిగిపోయి మూలనచేరింది. కేవలం పంచాయతీ, ఎంపీటీసీ, అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికలు మినహా ఏడాదిలో మరే సంవత్సరం ఈ పాఠశాల దుస్థితిపై అధికారులు శ్రద్ధ తీసుకున్న దాఖలాలు లేవు. విద్యార్థులు తాగేందుకు తాగు నీరు సైతం లేదు. దీంతో పాఠశాల ఆవరణలో గెయిల్ సంస్థ సౌజన్యంతో నిర్మించిన టాయ్‌లెట్స్‌కు నీటి సదుపాయాలు లేకుండా పోయాయి. పాఠశాల దుస్థితిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణం సత్వరం స్పందించి మెరుగైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో పశువుల శాల వ్యర్థాలు, మూలన చేరిన గొట్టపుబావి

వాకలపూడిలో ఏపీఎస్పీ ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్



విపత్తుల్లో చిక్కుకున్న విద్యార్థులను రక్షించి తీసుకువస్తున్న ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, గ్యాస్ లీకేజీ నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సర్పవరం జంక్షన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సముద్రతీర ప్రాంతంలో గల పలు కర్మాగారాలు నుంచి ప్రమాదం ఎదురైతే, తుఫాన్లు, ప్రకృతి విపత్తులు వేళ..భవనాలు కూలిపోయినప్పుడు తీసుకోవాల్సిన నివారణ,భద్రత చర్యలపై ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు, ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వాకలపూడి హైస్కూల్లో మండల రెవెన్యూ అధికారిణి ఎస్ఎల్ఎన్.కుమారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో విద్యార్థులకు ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ 35 మంది సభ్యుల బృందం తుఫాన్లు, విపత్తులపై అవగాహన, ప్రదర్శన సదస్సు నిర్వహించారు. కాలుష్యకారక కలుషితంతో అస్వస్థతకు గురైన వారు, నీరు, బోరుబావి ప్రమాదం, భవనాలు కూలిపోవడం, అగ్ని ప్రమాదాలు, తుఫాన్లు, విపత్తుల వేళ తీసుకోవాల్సిన నివారణ, రక్షణ చర్యలపై సిబ్బంది నివారణా పరికరాలు ప్రదర్శించి విద్యార్థులకు ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు ఏఎస్ఐలు వి.రాము, వి.రవి, ఏడీఎఫ్‌వో సుబ్బారావు అవగాహన కల్పించారు. విక్టిమ్ లోకేటింగ్ కెమెరా, హైడ్రాలిక్ స్ప్రెడ్డర్, ఉడ్ కట్టర్ సా, పెట్రోల్, ఎలక్ట్రిక్, స్కూబా, ఫ్లడ్ వాటర్ రిస్క్యూ, లైఫ్ జాకెట్లు, అగ్ని మాపకనిరోధక సాధనాలు వంటి పరికరాలను ప్రదర్శించారు.

రూ.1.20కోట్లు మిగులుతో బడ్జెట్ ఆమోదం

పిఠాపురంలో మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం


పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ దృశ్యం

పిఠాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పురపాలకసంఘానికి సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1.20కోట్లు మిగులుతో రూపొందించిన అంచనా బడ్జెట్‌కు ఆమోదం లభించింది. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశానికి చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షత వహించారు. 2024-25 సవరించిన బడ్జెట్ అంచనాలు, 25-26 అంచనా బడ్జెట్‌ను కమిషనరు నామా కనకారావు సమావేశంలో ప్రవేశపెట్టారు. శాఖల వారీగా, వివిధ పద్దుల కింద ఆదాయం, వ్యయం వివరాలను బడ్జెట్‌లో పొందుపరిచారు. అన్నిమార్గాల ద్వారా రూ.22,02,99,000 ఆదాయం, వివిధ పద్దుల ద్వారా రూ.20,82,48,000 వ్యయం అవుతుందని అంచనా వేశారు. తద్వారా రూ.1,20,50,000 మిగులు ఉంటుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి కథనం ప్రస్తావన

18వ వార్డు సమస్యలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనాన్ని వార్డు కౌన్సిలర్ పంపన బోయిన అన్నపూర్ణ ప్రస్తావించారు. సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య నిర్వహణకు అదనంగా 30మంది సిబ్బంది కావాలని కోరామని అది ఏమైందని కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరీ ప్రశ్నించారు. డబుల్ ఎసెస్‌మెంట్లు తొలగించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కోళ్ల బంగారుబాబు తెలిపారు. బడ్జెట్ సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడంపై బోను దేవ ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక సంఘ ఉద్యోగులు రూ.60లక్షలు అడ్వాన్సులు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంపై నిలదీశారు. బడ్జెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరు కాకుంటే ఎలా అని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు.


సమావేశంలో ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రస్తావిస్తున్న కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ

'రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు'

సర్పవరం జంక్షన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల దావోస్ పర్యటన విజయవంతం కావడం శుభసూచకమని, రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు వచ్చాయని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం వలసపాకలలో విలేకరులతో మాట్లాడుతూ దావోస్‌లో ఏపీ బ్రాండ్ పునరుద్ధరణే ధ్యేయంగా మంత్రి లోకేశ్ తన గళం, విజన్‌ని వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో వినిపించారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారన్నారు. ఒక్క జూమ్ కాల్‌తోనే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ కంపెనీలతో మాట్లాడిన లోకేశ్ రాష్ట్రానికి 1.46 లక్షల కోట్లు పెట్టుబడులను తీసుకువచ్చారన్నారు. జగన్ నిర్ణయాలతో పారిశ్రామిక రంగం కుదేలైందని, మళ్లీ రాష్ట్రంలో వెలుగులు నింపేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. రానున్నకాలంలో యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావు

కాకినాడ సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎ.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ మంగళవారం జీవో ఆర్‌టీ నెంబర్ 46 జారీ చేశారు.

'ఉపాధి పథకాన్ని పరిరక్షించుకోవాలి'

యానాం/తాళ్లరేవు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన జాతీయ ఉపాధిహామి పథకాన్ని సంఘటితంగా పరిరక్షించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కమిడి సత్యశ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాళ్లరేవు మండలం ప్రజా సంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు కచ్చితంగా రూ.400ఇవ్వాలని 150 రోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధి పనిలో ఇచ్చిన సదుపాయాలన్ని పునరుద్ధరించాలని కోరారు. సంఘం బలోపేతానికి ఫిబ్రవరి 1 నుంచి సభ్యత్వాలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండలాధ్యక్షుడు దుప్పి ఆదృష్టదీపుడు, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు అత్తిలి బాబురావు, కమిడి ఈశ్వరీబాయి, వస్కారెడ్డి, విప్పర్తి శ్రీనివాస్, కృష్ణా, తవిటీకి అధిలక్ష్మీ, గంటా గోపి, గోడి భాస్కరరావు, కట్టా మంగాదేవి, మోర్త అనసూయ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఏపీ వ్యవసాయకార్మిక సంఘం ప్రతినిధులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ప్రచారం


ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కాకినాడ సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శెట్టిబత్తుల రాజబాబు కాకినాడ కోర్టు సముదాయంలో పలువురు న్యాయవాదులను మంగళవారం కోరారు. తొలుత కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ నరహరశెట్టి రవికృష్ణ ప్రచార కరపత్రం ఆవిష్కరించారు. అభ్యర్థి రాజబాబు మాట్లాడుతూ శాసనమండలిలో సకల జనుల గళం అవుతానని, సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి చెక్కా శ్రీనివాసరావు, న్యాయవాదులు తప్పెట్ల పృథ్వీరాజ్, కుంచె శ్రీహరి, అత్తిలి సీతారామస్వామి, గెద్దాడ వెంకటేశ్వరరావు, సయ్యద్ సలార్, డేవిడ్ శామ్యూల్, విజయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

ఎస్పీ బిందుమాధవ్


హెల్మెట్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ

కాకినాడ క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధారణ ద్వారా సురక్షిత ప్రయాణం చేసి గమ్యస్థానాలకు ఆనందమయంగా వెళ్లి ఆయా కుటుంబాలతో సంతోషంగా గడపాలని ఎస్పీ జి.బిందు మాధవ్ ఆకాంక్షించారు. రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా ఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం హెల్మెట్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధారణ ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలియచెప్పారు. ర్యాలీ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై భానుగుడి జంక్షన్, మెయిన్‌రోడ్డు మీదుగా మసీద్ సెంటర్, బాలా జీచెరువు సెంటర్, జడ్పీ సెంటర్, నూకాలమ్మతల్లిగుడి, భానుగుడి జంక్షన్ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీలో ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్‌పాటిల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు ఎన్.రమేష్, డి.రామారావు పాల్గొన్నారు.

కిశోర బాలల పరిరక్షణే ధ్యేయం

జిల్లా ఐసీడీఎస్ పీడీ విజయకుమారి


ప్రసంగిస్తున్న పీడీ విజయకుమారి

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నందున ఐసీడీఎస్, సచివాలయాల, మెప్మా శాఖలకు చెందిన సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విజయకుమారి పేర్కొన్నారు. సామర్లకోట లయన్స్ క్లబ్ ఆవరణలో మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల సంయుక్త ఆధ్వర్యంలో సీడీపీవో జీ.ఉషా అధ్యక్షతన కిశోరి వికాసం పేరిట శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పీడీ విజయకుమారి మాట్లాడుతూ కిశోరి వికాసం ద్వారా వార్డు స్థాయిల్లో గ్రూపులు ఏర్పాటుచేసి వారికి బాలల చట్టాలు, పరిరక్షణ అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మరో ముఖ్య అతిథి మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ సమాజంలో నేటి పౌరులుగా ఎదగాల్సిన బాలల హక్కులు, చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. సీడీపీవో ఉషా మాట్లాడుతూ నేటి సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్ర రూపం దాల్చిందన్నారు. బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు అధికమవుతున్నాయన్నారు. బాలలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కిశోరి ఆరోగ్యం, ఆహారం విషయమై మెడికల్ అధికారి ప్రభ వివరించారు. జిల్లా బాల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకట్రావు కిశోరి వికాసంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. తరగతుల్లో సీఐ కృష్ణభగవాన్, ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, బి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, కె.విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంగ, మహమ్మద్ సుల్తానా బీబీ, నిర్మలాకుమారి, జీ.వీరలక్ష్మి, నాగేంద్ర, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు

ఏడీ సురేష్‌బాబు


కరపలో పశువైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కరప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు ఎన్‌జేఎస్ సురేష్‌బాబు సూచించారు. కరప ప్రాంతీయ పశువైద్యశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశుఆరోగ్య వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. పశువులకు వచ్చే వివిధ రకాల అంతర పరాన్న జీవుల నిరోధకానికి అనేక రకాల జలగ నివారణ మందులును ప్రభుత్వం పాడిరైతులకు ఉచితంగా అందిస్తుందన్నారు. 90శాతం వరకు పెయ్య దూడలను మాత్రమే పుట్టించే వీర్యం అన్ని రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 82 లేగ దూడలకు ఏలిక పాములు నివారణ మందులు, 157 పాడి పశువులకు జలగ వ్యాధి నివారణ మందులు, 200గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అలాగే గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు, పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సను అందజేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న, నాయకులు పేకేటి దుర్గాప్రసాద్, పేపకాయల పవన్‌కుమార్, పశువైద్య సిబ్బంది చింతల వరప్రసాద్, దుర్గాభవాని, పశుసంవర్థకశాఖ సహాయకులు మణికంఠ, గోవిందు, సలీం, శ్రీనివాస్ తదితరులున్నారు.

రాజ్‌కుమార్‌కు అభినందన


రాజ్‌కుమార్‌ను అభినందించిన కలెక్టర్

కాకినాడ సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో రాజ్‌కుమార్ మరింతగా రాణించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆకాంక్షించారు. మైసూర్‌లో 2024, డిసెంబరు 10న జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజక పతక విజేత అయిన తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ వాసి అరదాడి మహేధర్ రాజ్‌కుమార్‌ను కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. కలెక్టర్ ఛాంబర్‌లో రాజ్‌కుమార్‌ను రజత పతకంతో మంగళవారం అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి బి.శ్రీనివాసరావు, తూరంగి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఐసీడీఎస్ పీడీ

కాకినాడ సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా సీడీపీవోగా పనిచేస్తూ పదోన్నతిపై కాకినాడ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీగా నియమితులైన కె.విజయకుమారి మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీ

పిఠాపురంలో మాదిగ దండోరా సంబరాలు


మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాదిగ దండోరా నాయకులు

పిఠాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం పట్ల మాదిగ దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి నాయకులు మంగళవారం పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. డప్పులు కొడుతూ కేంద్రం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. వికలాంగులు, ప్రజా సంక్షేమం, ఎస్సీ వర్గీకరణ కోసం నిస్వార్థంగా అలుపెరగని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ద్వారా కేంద్రం తగిన గుర్తింపు ఇచ్చిందని నాయకులు అన్నారు. అనంతరం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి మాదిగ దండోరా నాయకులు, డప్పు కళాకారులు, రిక్షా కార్మికులు పాలాభిషేకం నిర్వహించారు.

ఫార్మసీ కళాశాలలో ముగిసిన శిక్షణ

యానాం/తాళ్లరేవు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగంలో రిజిస్టర్ అయిన ఫార్మసిస్టులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి గత పదిరోజులుగా కోరంగి ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమం ముగిసింది. లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ శిక్షణ నిర్వహించారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా స్వల్ప కాలిక నైపుణ్య శిక్షణ ఫార్మసీ రంగానికి సంబంధించిన ఈ శిక్షణను కోరంగి ఫార్మసీ కళాశాలకు కేటాయించడం పట్ల ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు మొంటు పటేల్ తదితరులకు కళాశాల కరస్పాండెంట్ పి.కనక రాజు కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి,ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురంలో బీఎస్సీ హార్టికల్చర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన సాగులో అవలంభించాల్సిన పద్ధతులు, సాగులో మెళకువలు తదితర విషయాలపై ఉద్యానశాఖాధికారులు అవగాహన కల్పించారు. నూతన సాగు పద్ధతులు, సేంద్రియ సాగు ఆవశ్యకత హైడ్రోఫోనిక్స్, ఆయిల్ పామ్ తోటల్లో అంతరపంటల సాగు, మల్చింగ్, సమీపకృత సాగు, నాడెప్ తదితర విషయాలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్యలక్ష్మీ, సునీత, సుజాత, జానకి, హరిరామ్, వీఏఏలు విజయదుర్గ, అమృతవర్షిణి, కూటమి నేతలు మేడిది శ్రీనివాస్, ఏలేటి సుబ్బారావు, అడపా శివదుర్గ, గంగాధర్, మాదిరెడ్డి రామకృష్ణ, కొంగర వెంకట్రావు, బొడ్డు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌వో తనిఖీలు


గొల్లప్రోలు మార్కెట్‌యార్డులోని సివిల్ సప్లైస్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్‌వో

గొల్లప్రోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని మార్కెట్‌యార్డులో గల సివిల్ సప్లైస్ గోడౌన్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసన్నలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్టమ్ మిల్లింగ్ ద్వారా మిల్లరు ఇచ్చిన బియ్యం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ


పిఠాపురంలో ప్రభుత్వ కళాశాల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

పిఠాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సరయిన ధృవీకరణపత్రాలు లేకున్నా, మద్యం తాగి డ్రైవింగ్ చేసినా సదరు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. పిఠాపురం ఆర్ఆర్ బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వాహన తనిఖీలు జరిపి పలు వాహనాలు సీజ్ చేశారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐ మణికుమార్, అడిషనల్ ఎస్ఐ జానీభాషా తదితరులు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన కామేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

పిఠాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎం.కామేశ్వరరావుకి తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ద్వారా డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.జయసుబ్బారెడ్డి పర్యవేక్షణలో సిగ్మా టౌ రివర్స్ డెరివేటివ్స్ ఇన్ రింగ్స్ అనే అంశంపై పరిశోధన చేసి పత్రాలు సమర్పించగా పీహెచ్‌డీ ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో కామేశ్వరరావును సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం

కొత్తపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఉప్పాడకు చెందిన యువకులు ఎంపికయ్యారు. వారిని ప్రోత్సహిస్తూ ఉప్పాడకు చెందిన మత్స్యకార, జనసేన నాయకుడు గంటా విజయ్‌కుమార్ మంగళవారం రూ.10వేల నగదు అందజేశారు.



జియోలాజికల్ ఫీల్డ్ ట్రిప్

గండేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థులు డిపార్టుమెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ మార్గదర్శకత్వంలో జియోలాజికల్ ఫీల్డ్ ట్రిప్ ప్రారంభించినట్టు విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలోని ముఖ్యమైన భౌగోళిక నిర్మాణాలను అన్వేషించడంపై ఈ పర్యటన దృష్టి సారించిందన్నారు. విద్యార్థులకు తరగతి గది అభ్యాసాన్ని వాస్తవ ప్రపంచ భౌగోళిక నిర్మాణాలతో అనుసంధానించడానికి అవకాశం కల్పిస్తుందన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రధానమంత్రి జన్‌మన్ కింద అల్లూరి జిల్లాకు రూ.246 కోట్లు

పీవీటీజీ గ్రామాల రోడ్ల మొత్తం 76 పనుల్లో 71 పనులు ఇక్కడే

265 కిలో మీటర్ల మేర రహదారుల నిర్మాణానికి కూటమి సర్కారు చర్యలు

రంపచోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ముఖ్యంగా ఆదిమ జాతి గిరిజనులు (పీవీటీజీ) ఉండే ప్రాంతాలకు మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద అల్లూరి జిల్లాలో రూ.246 కోట్లతో 71 పనులను రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను జోడించి మంజూరు చేసింది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా చేపట్టే ఈ పనుల పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. మొత్తంగా జిల్లాలోని 14 మండలాల్లో 71 గ్రామాలకు 265 కిలోమీటర్ల నిడివిన రహదారులు నిర్మిస్తారు. ఈ పనుల కోసం రూ.246కోట్ల అంచనా విలువలో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.100 కోట్లను జోడించి మంజూరు చేశారు.

అడ్డతీగల మండలంలో రూ.2.20 కోట్లతో రెండు పనులు, చింతూరు మండలంలో రూ.80లక్షలతో ఒక పని, కూనవరం మండలంలో రూ.7.03 కోట్లతో రెండు పనులు, వై.రామవరం మండలంలో రూ.15. 57 కోట్లతో ఐదు పనులను ప్రభుత్వం రంపచో డవరం నియోజకవర్గంలో మంజూరు చేసింది. అరకు, పాడేరు నియోజకవర్గాల్లో మిగిలిన 61 పనులు చేపట్టేందుకు రూ.220 కోట్లు మంజూరు చేశారు.



విజేత జట్టు సభ్యులకు ట్రోఫీ, చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి-విజయభాస్కర్ దంపతులు

అల్లూరి క్రికెట్ టోర్నీ విజేత 'రఘు కైట్స్'

అడ్డతీగల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం అల్లూరి సీతారామరాజు స్మారక క్రికెట్ టోర్నీ ఫైనల్స్ నిర్వహించగా అడ్డతీగల రఘు కైట్స్ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి-విజయభాస్కర్ దంపతులు విజేత జట్టు సభ్యులకు రూ.30 వేల నగదు, ట్రోఫీ, రన్నరప్‌కు రూ.20వేల నగదు, ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా చదువు, క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రెండో రోజు సామూహిక దీక్షలను ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

'కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి'

చింతూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. చింతూరు డివిజన్ పరిధిలోని వీవోఏలు ఐటీడీఏ ఎదుట చేపట్టిన దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. శిబిరాన్ని ప్రారంభించిన వెంకట్ మాట్లాడుతూ తొమ్మిది నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ అధికారులకు అందజేశారు. నాయకులు సీసం సురేష్, గొర్రె లక్ష్మయ్య, రత్తయ్య, దూలయ్య తదితరులు పాల్గొన్నారు.

'పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందించాలి'



వైద్యాధికారులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కె.ఎర్రంపాలెం ఆశ్రమ బాలికల పాఠశాల, సచివాలయం, నరసాపురం పీహెచ్‌సీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీలకు వచ్చే రోగుల రక్త నమూనాలు సేకరించి ఆయా వ్యాధులకు మందులు అందజేయాలన్నారు. గర్భిణులకు రక్తహీనత లేమీ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. వీఆర్వో జమున విధులకు గైర్హాజరు కావడంపై పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్వచ్ఛంద సేవకులకు నిత్యావసరాల కిట్లు పంపిణీ



స్వచ్ఛంద సంస్థ అందజేసిన నిత్యావసరాల కిట్లు

వీఆర్ పురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లవారిగూడెం, గుల్లేటివాడ, దారపల్లి, నూతిగూడెం గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా డ్రైనేజీలు నిర్మించుకుని శుభ్రం చేసుకున్నారు. సొంతంగా కమ్యూనిటీ హాళ్లు కూడా నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ నాలుగు గ్రామాల వారికి రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు ఆధ్వర్యంలో మంగళవారం రూ.5.70 లక్షలు విలువైన నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజరు చల్లారి సాయి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ ఎన్.రవి, నాగమణి, తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 31న జాబ్‌మేళా

రంపచోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ (సిడాప్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాల లోపు వయసు ఉండి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువత ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. జాబ్ మేళాలో పేటీఎం, బ్లింక్, ఇట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.naipunyam.ap.gov.in లేదా 6304634447, 9398338105 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'ఆదిత్య'లో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం

గండేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ఆదిత్య జనరల్ సెక్రటరీ లక్ష్మీరాజ్యం, ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య జనరల్ సెక్రటరీ లక్ష్మీరాజ్యం జన్మదినం సందర్భంగా ఆదిత్య వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 1,350 మంది రక్తదానం చేశారన్నారు. రక్తదానం మహాదానం అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక మంది జీవితాలను కాపాడడానికి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపడానికి తోడ్పడే రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అభినందనీయులేనన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్‌కుమార్, ఎస్‌టీవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బస్టాండు ఎదురుగా డ్రైన్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

డ్రైన్లపై ఆక్రమణల తొలగింపు

ప్రత్తిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో రహదారి వెంబడి డ్రైన్‌లపై ఆక్రమణల తొలగింపునకు అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. డ్రైన్‌లపై ఆక్రమణల వల్ల పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, సామర్లకోట-ప్రత్తిపాడు ఆర్అండ్‌బీ రహదారిపై ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. దీనిపై స్థానికులు లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా.... లోకాయుక్త ఆదేశాల మేరకు డీపీవో, డీఎల్పీవో సూచనలతో మేరకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు సెంటరు నుంచి ఇంద్రమహల్ వరకు కిర్లంపూడి వైపు మార్గంలో రహదారికి ఇరువైపులా డ్రైన్‌లపై ఆక్రమణలను ఎక్స్‌కవేటరుతో తొలగించారు.

వంద శాతం రాయితీపై పామాయిల్ మొక్కలు

శంఖవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు వంద శాతం రాయితీపై పామాయిల్ మొక్కలు అందజేస్తామని ఉద్యానవన శాఖాధికారి పి.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నెల్లిపూడి, కొంతంగి కొత్తూరు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. తుంపర్ల సేద్యంలో 45-90 రాయితీ అందుబాటులో ఉందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి పి.గాంధీ మాట్లాడుతూ రైతులంతా పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. ఏఈవో మౌళిప్రసాద్, వీఏఏ శ్రావణి, వీహెచ్ఏ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

'స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం'

అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీజేపీ శ్రేణులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం అన్నవరంలోని ఓ ప్రైవేటు లాడ్జీలో నిర్వహించిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. బీజేపీ మాత్రమే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు గౌరవం ఇచ్చి ఆయన రాసిన రాజ్యాంగాన్ని సామాన్య ప్రజల చెంతకు తీసుకెళ్తోందన్నారు. నాయకులు పైడా కృష్ణమోహన్, వై.మాలకొండయ్య, కామర్స్ చిరంజీవి, సింగిలిదేవి సత్తిరాజు, చలికి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే దివ్య



తుని మండలం తేటగుంటలో పీహెచ్‌సీ అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తామని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తేటగుంట పీహెచ్‌సీలో ఆరు పడకల అదనపు భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో బొప్పన రాము, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, గజ్జి రాంబాబు, గెట్టా శివ, మర్రి వీరబాబు, కలగా శ్రీను, బంధం బుజ్జి, పప్పు నవీన్, చామంతి సత్తిబాబు, గొర్ల వీరబాబు తదితరులు ఉన్నారు.

లోవ ఆలయ అభివృద్ధికి పాటుపడతాం

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానం అభివృద్ధికి పాటుపడతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. భక్తులు కొండ ఎక్కేందుకు ఎస్కలేటర్ నిర్మాణానికి రూ.3.65 లక్షలు కేటాయించగా ఆ పనులకు ఎమ్మెల్యే మంగళవారం శ్రీకారం చుట్టారు. రూ.40లక్షలతో రాతి మెట్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోవ దేవస్థానాన్ని మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈవో విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే దివ్యగోపీనాథ్ దంపతులు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), గొర్లి అచ్చినాయుడు, దూలం మాణిక్యం, తమరాన సత్యనారాయణ, సురలబాడయ్య, జక్కాన రామునాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

అన్నవరం (తొండంగి), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తుని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. తొండంగి మండలం గడ్డిపేట పీహెచ్‌సీలో రూ.50లక్షలతో నిర్మించబోయే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపరిచేందుకు, మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యనమల రాజేష్, కోడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా పెరమయ్య



పెరమయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడవరంలో మంగళవారం బీజేపీ సమావేశం నిర్వహించారు. ముఖ్య నాయకులు నోముల రామారావు, పాయం వెంకయ్య సమక్షంలో మండల శాఖ అధ్యక్షుడిగా మోదుగు పెరమయ్యను ఎన్నుకున్నారు. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొల్లా ప్రసాద్, డి.ఉమాశంకర్, ఎన్.రాజేష్, రాజు, జయమ్మ పాలొన్నారు.

డొంకరాయిని కమ్మిన పొగ మంచు



మోతుగూడెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలో మంగళవారం ఉదయం పొగ మంచు కమ్ముకుంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా తగ్గలేదు. బాటసారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. వాహనచోదకులు లైట్లు వేసుకుని ప్రయాణం కొనసాగించారు.

'విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేయాలి'



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సూచించారు. మండలంలోని బి.వెలమలకోట సచివాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలాన్ని చరవాణి ద్వారా కోరారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, కూటమి నాయకులు వున్నారు.

రేపు ఎటపాక మండల సర్వసభ్య సమావేశం

ఎటపాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల పరిధిలోని అభివృద్ధి పనుల నివేదికలతో హాజరు కావాలని సూచించారు.



గీతా జ్ఞాన యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

అన్నవరంలో ముగిసిన గీతా జ్ఞాన యజ్ఞం

అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఈ నెల 26న ప్రారంభమైన గీతా జ్ఞాన యజ్ఞం మంగళవారం ముగిసింది. సీతారామ సత్రం వద్ద మేడపాడుకు చెందిన గీతాశ్రమం యువసేవా కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గీతాశ్రమం అధిపతి శంకరానందగిరి స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలన్నారు. లలితా సహస్రనామపారాయణ, విష్ణుసహస్రనామపారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ, ప్రముఖుల ఉపన్యాసాలు జరిగాయి.

డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం



జగ్గంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం 400 మంది భోజనాలు చేశారు. రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, అంకం ఓం, గంధం శ్రీనివాస్, సత్తి సోమరాజు, రాపేటి చిట్టిబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'పశువుల్లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

కోటనందూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి డాక్టర్ రత్నతేజ కోరారు. మంగళవారం ఎస్ఆర్ పేట గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో తరుచూ గర్భకోశ వ్యాధితో నట్టల వ్యాధి ప్రబలుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతల సూరిబాబు, గుడివాడ తాతబాబు, లిఖిత, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): పోతులూరు, చింతలూరు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామాల్లో ఎదకు వచ్చిన పశువులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులకు పశువైద్యాధికారులు పలు సూచనలు చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అపరాల్లో అధిక దిగుబడులు

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులు పాటిస్తే అపరాల్లో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ శాఖ ఏడీ ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. 'పొలం పిలుస్తోంది' భాగంగా మంగళవారం ఆయన మండలంలోని హంసవరం, టి.వెంకటాపురం గ్రామాల్లో పర్యటించి అపరాల పంటల్లో మెళకువలను రైతులకు వివరించారు. ఏవో అశోక్, ఏఈవో జగ్గప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో పొలం పిలుస్తోంది

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండేపల్లి, యల్లమిల్లి గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏవో సద్గురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం కిసాన్ డ్రోన్‌లను రైతు సంఘాలకు 80శాతం రాయితీ అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. పీఎం కిసాన్ పథకం కింద రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చే రూ.6 వేలను రూ.10వేలకు కేంద్రం పెంచిందన్నారు. వీహెచ్ఏ ఉదయ్, వీఏఏ అంజలి, నాయకులు యరమాటి కాశి, పెనుమర్తి భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడుపుతున్న 11 మందిపై కేసు

జగ్గంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సర్కిల్ పరిధిలో తాగి వాహనాలు నడుపుతున్న 11 మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా, ఐదుగురికి మూడు రోజులు జైలు శిక్ష విధించారు.

600లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ సిబ్బంది మంగళవారం అప్పలపాలెంలో దాడులు నిర్వహించారు. సారా తయారీకి వినియోగించే 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ శివప్రసాద్, ఎస్ఐ పి.వంశీరామ్ సిబ్బంది పాల్గొన్నారు.



రెండో రోజుకు రావులమ్మ అమ్మవారి సంబరం

జగ్గంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గా రావులమ్మ అమ్మవారి సంబరాలు రెండో రోజైన మంగళవారం ఘనంగా జరిగాయి. గరగ నృత్యాలు, శక్తివేషాలు, బండ్లపై అమ్మవారు, వెంకన్నబాబు వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగ్గంపేట ఎస్ఐ రఘునందనరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.